క్లుప్తంగా

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రైసైకిళ్లతో దివ్యాంగులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో దివ్యాంగులైన భాస్కర్‌రెడ్డి, చాంద్‌బాషాకు ఉచితంగా ట్రై సైకిళ్లను నవ్యాంధ్ర వికలాంగుల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఆగస్టులో ఆర్డీటీ సంస్థ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మెడికల్ క్యాంపు నిర్వహించారన్నారు. అర్హులైన వారికి ట్రైసైకిళ్లను మంజూరు చేయగా ఆదివారం లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. అలాగే మండలంలో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా కో-ఆర్డినేటర్ జఫ్రుల్లా

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రుల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా తనిఖీ చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై వైద్యులు, పారామెడికల్, నాల్గవ తరగతి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎక్స్–రే, డ్రగ్ స్టోర్, ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ సరఫరా విభాగాలను పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

సంగమేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు



చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరం ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈఓ రామలింగారెడ్డి, పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ముందు భాగంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు వంటి పనులు చేపట్టారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 849 అడుగులు ఉందని, మరో 11 అడుగులు తగ్గితే ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి పూర్తిగా బయటపడుతుందని వెల్లడించారు.

పేరుకే వైద్య కేంద్రం



పాలధార-పంచధార వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య కేంద్రం

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం పాలధార–పంచధార వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐదు పడకలతో తాత్కాలిక వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైద్య కేంద్రం చుట్టూ దుకాణాలు ఉండటం, రోడ్డుకు అవతలి వైపు ఉండటంతో అక్కడ వైద్య కేంద్రం ఉన్నట్లు కూడా భక్తులకు తెలియడం లేదు. అంతేకాకుండా.. కేంద్రంలో నాలుగు పడకలు మాత్రమే ఉన్నాయి. వైద్యులు అందుబాటులో లేరు. ఏఎన్ఎంలు మొక్కుబడిగా కొన్ని మందులను పెట్టుకుని ఉన్నారు. అధికారులు స్పందించి.. భక్తులందరికీ తెలిసేలా వైద్య కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు, డాక్టర్లు అందుబాటులో చూడాల్సిన అవసరం ఉంది.

శివ భక్తులకు దాహం.. దాహం

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శివ భక్తులు దాహంతో అల్లాడుతున్నారు. శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తుల కోసం వెంకటాపురంతో పాటు పలు ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కల్పించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. భక్తుల పాదయాత్ర ప్రారంభమై వారం రోజులు గడిచినా తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో భక్తులు దాహంతో అల్లాడిపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో లీటర్ వాటర్ బాటిల్ రూ.30కు కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ యేడాది మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో శివస్వాములు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీశైల లింగం..

శిరసా నమామి



మనవడిని ఎత్తుకొని నాగలూటి అడవి మార్గంలో వెళ్తున్న భక్తుడు

- 41 రోజుల కఠోర దీక్ష పూని శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు
- నల్లమల అడవిలో కొండా కోనల వెంట పాదయాత్ర
- దారిపొడవునా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, సేవలు



నాగలూటి వద్ద నడక సాగిస్తున్న భక్తులు

ఆత్మకూరు: శ్రీశైల క్షేత్రంలో వెలసిన శివుడిని స్పర్శ దర్శనం చేసుకుంటే కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుందన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అతి కఠినమైన కాలినడక మార్గంలో అలసట, ఆయాసం, కాళ్ల నొప్పులు, ఎండ, దాహాన్ని లెక్కచేయకుండా నడిచివచ్చి మహాశివుడి స్పర్శదర్శనం కోసం శివస్వాములు పడే తపన అంతా ఇంతా కాదు. ప్రయాసలన్నీ దాటి శ్రీశైలం చేరుకుని మహాలింగాన్ని స్పర్శదర్శనం చేసుకుంటే వారు పొందే ఆనందం వర్ణనాతీతం. ఇందుకోసం మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి శివస్వాములు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి తరలివస్తున్నారు.

కాళ్లు బొబ్బలు పొంగినా ఆగని పాదయాత్ర

వందల కిలోమీటర్ల దూరం కాలినడకన తరలివచ్చే శివస్వాములకు కాళ్లకు బొబ్బలు పొంగినా, రక్తం వచ్చినా.. ఆ కష్టాన్ని ఆనందంగా స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఎండలు మండుతుండడంతో కాస్త రక్షణ కోసం కాళ్లకు గోనెసంచులు కట్టుకుని అడుగులో అడుగు వేసుకుంటూ ఎంత దూరమైనా మల్లన్న దర్శన భాగ్యమే పుణ్యఫలం అని భావిస్తూ శ్రీశైలం వైపు అడుగులేస్తున్నారు. ప్రధానంగా నల్లమలలో కొండాకోనల వెంట అతికష్టమైన అటవీ మార్గంలో అక్కడక్కడా సేద తీరుతూ శ్రీశైలానికి వెళ్తున్నారు. కాళ్ల నొప్పులు పట్టినా లెక్కచేయక మల్లన్నపై ఎనలేని భక్తితో ముందుకు సాగుతున్నారు.

అన్నదాన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు:

కాలినడకన వెళ్లే భక్తులకు, శివస్వాములకు అడుగడుగునా అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో గ్రామగ్రామాల్లో, నల్లమలలోని పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అలాగే ఉచితంగా తాగునీరు అందిస్తున్నారు. పలు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు సేవలందిస్తున్నారు.



అరణ్య మార్గంలో నడక సాగిస్తున్న భక్తులు



వెంకటాపురం కంది పంటలో నడిచి వెళ్తున్న భక్తులు

పాదయాత్ర ఓ మహాభాగ్యం



శివస్వాములకు పాదయాత్ర ద్వారా శ్రీశైలం చేరుకోవడం ఓ భాగ్యం. నేను మూడు సంవత్సరాలుగా మహాశివరాత్రి సమయంలో శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్నాను. వాటర్ బాటిల్, టార్చ్ లైట్ ఉంటే రాత్రి వేళ కూడా ముందుకు వెళ్లొచ్చు. పెచ్చెర్వు, నాగలూటి, భీమునికొలను, వద్ద లైట్లు ఏర్పాటు చేయాలి. అప్పుడు మరి కొంత మంది పాదయాత్రగా రావడానికి మొగ్గు చూపుతారు. – **ఉరుకుంద, బోదెపాడు, గొనెగండ్ల మండలం, కర్నూలు జిల్లా**

గోనె సంచులే పాదాలకు రక్ష



ఎండలు అధికంగా ఉండటంతో శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులు పాదాలకు రక్షణగా గోనె సంచులను ఏర్పాటు చేసుకోవడం మంచిది. నేను గత ఐదేళ్లుగా మహాశివరాత్రి సమయంలో శ్రీశైలానికి కాలినడకన వెళుతున్నాను. ప్రస్తుతం 6 రోజులుగా పాదయాత్ర సాగిస్తున్నాను. కొల్లాపురం నుంచి కాలినడకన సోమశిలకు చేరుకున్నాం. అక్కడినుంచి కృష్ణానది దాటి సంగమేశ్వరం, కపిలేశ్వరం, ఎర్రమఠం, కొత్తపల్లి, ఆత్మకూరు మీదుగా వెంకటాపురం చేరుకున్నాను. మరో రెండు రోజుల్లో శ్రీశైలం చేరుకుంటాను. – **యాదగిరి, కొల్లాపురం, నాగర్‌కర్నూలు జిల్లా**

శివమాల ఎంతో పవిత్రం



నేను శివమాలధారణ చేసి 42 రోజులు గడిచింది. శివమాలధరిస్తే కష్టాలు తప్పుతాయి. నేను ఏడు రోజులుగా నడక సాగిస్తున్నాను. మా ఊరి మీదుగా కెంచెనపల్లి, గుండ్లపల్లి, గుత్తి, వజ్రకరూరు, ఉరవకొండ, గోపాల్‌నగర్, యాగంటి, నందవరం, బలపనూరు, పెసరవాయి, వెలుగోడు, ఆత్మకూరు, వెంకటాపురం మీదుగా కాలినడకన నాగలూటికి వెళ్తున్నాను. ఇక్కడి నుంచి శ్రీశైలం చేరుకుని ఇరుముడి సమర్పిస్తాను.– **బచ్చలప్ప, సంజీపురం, బ్రహ్మసముద్రం, అనంతపురం జిల్లా**

బొబ్బలెక్కినా ఇబ్బందులు పడలేదు



నేను కళ్యాణదుర్గం నుంచి 430 కి.మీ. దూరంలో ఉన్న శ్రీశైలం మహాక్షేత్రానికి ఐదు రోజులుగా పాదయాత్ర సాగిస్తున్నాను. కాళ్లు బొబ్బలెక్కినా ఇబ్బంది పడలేదు. అక్కడక్కడ వైద్య శాలల్లో మందులు తీసుకుంటూ ముందుకు సాగుతున్నాను. అన్నదాన శిబిరాలు, వైద్య శిబిరాల వలన ఉపశమనం లభించింది. నొప్పులు ఉన్నప్పటికీ మల్లన్న దర్శనం కోసం వెళ్లడం ఆనందంగా ఉంది. – **శివకుమార్, కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా**

ఆదర్శ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వెలుగోడు: వెలుగోడు సమీపాన ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని వెల్లడించారు. పూర్తి వివరాలకు స్థానిక మోడల్ స్కూల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

వెలుగోడు: పట్టణంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం వీధిలో నరసింహ అనే వ్యక్తికి చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వివరాలు.. పట్టణానికి చెందిన నరసింహ గ్యాస్ ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఇంట్లో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఇంట్లోని నగదు, దుస్తులు, ఫర్నీచర్, ఫ్రిడ్జ్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయినట్లు బాధితులు వాపోయారు. రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

డాక్టరేట్ ప్రదానం

మహానంది: మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన గద్వాల సుధా మనోహర్‌కు డాక్టరేట్ లభించింది. వ్యాపార నాయకత్వం, కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, డిజిటల్ పరివర్తనలో ప్రత్యేకతలపై చేసిన పరిశోధనలకు గాను యూఎస్ఏలోని కాలిఫోర్నియా పబ్లిక్ యూనివర్సిటీ నుంచి ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు సుధా మనోహర్‌ను గ్రామ పెద్దలు, ప్రముఖులు అభినందించారు.

నాటుసారా స్వాధీనం

ఆత్మకూరు: శ్రీశైలం పరిసర ప్రాంతాల్లోని మాణిక్యమశిల, కొత్తపేట వద్ద దాడులు నిర్వహించి, ఇద్దరు నాటుసారా కలిగి ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు ఆదివారం తెలిపారు. మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి నిందితులను జైలుకు తరలించినట్లు చెప్పారు.

మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్నకు విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్



మహానంది: మహానందీశ్వరుడికి సమర్పించేందుకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డికి పట్టువస్త్రాలు అందిస్తున్న కాణిపాకం ఆలయ ఈఓ పెంచలకిషోర్

మహానందికి చేరుకున్న పెళ్లిపెద్దలు

మహానంది: మహానందీశ్వరుడి దంపతుల ఉత్సవాలు, కల్యాణోత్సవానికి పెళ్లిపెద్దలైన శ్రీ పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వర స్వామి దంపతులు ఆదివారం రాత్రి మహానందికి చేరుకున్నారు. నంద్యాల పట్టణంలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయం నుంచి బయల్దేరిన స్వామి, అమ్మవార్ల పల్లకీలు పెద్దకొట్టాల, బొల్లవరం, తమ్మడపల్లె, బుక్కాపురం మీదుగా అల్లినగరం, శ్రీనగరం, అయ్యన్ననగర్ గ్రామాల నుంచి మహానందికి చేరుకున్నారు. మహానందిలోని గోర్లయ్యమఠం వద్ద ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మాలల పంతం.. చంద్రబాబు పతనం

నందికొట్కూరు: అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు పతనమే లక్ష్యమని మాల మహానాడు జేఏసీ రాష్ట్ర నాయకులు జయరాముడు స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి ఆదివారం కర్నూలులో జరిగే రాయలసీమ యుద్ధ గర్జన సభకు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు పూనుకుంటున్న సీఎం చంద్రబాబుకు మాలల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగ సమస్యతో మాల యువత సతమతమవుతుంటే వర్గీకరణ అంశాన్ని తెరపైకి తేవడం దారుణమన్నారు. మాలమహానాడు నాయకులు డాక్టర్ రాజు, రాజ్‌కుమార్, తమ్మడపల్లె ఏసేపు, ఏసీహెచ్ నగేష్, పబ్బతి రవి ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో సభకు తరలివెళ్లారు.

చెంచు గిరిజనుల అభ్యున్నతికి కృషి


శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం చెంచు గిరిజనులకు పలు సంక్షేమ పథకాలను అందజేశారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంకల్ప్ కార్యక్రమం కింద జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన రు.5.80 లక్షలతో 30 మంది చెంచుగిరిజన మహిళలకు 30 రోజులపాటు సున్నిపెంట వైటీసీలో శిక్షణ ఇచ్చి అందరికీ కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో రక్తహీనతతో బాధపడుతున్న చెంచులకు రు.వెయ్యి విలువైన పౌష్టికాహార కిట్లను అందజేశారు. అలాగే నిత్యావసరాలు నిల్వ ఉంచుకునేందుకు అవసరమైన స్టీల్ డ్రమ్ములను అందించారు. మహానంది మండలంలోని చెంచులక్ష్మి గూడెంలోని 17 మందికి అటవీ భూహక్కు చట్టం కింద 17.71 ఎకరాల వ్యవసాయ భూమి పట్టాలను అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద లింగాలగట్టుకు చెందిన ధోని, శివకు రూ. 1.07 లక్షల చెక్కును అందజేశారు. ఐటీడీఏ పీఓ కె.వి.శివప్రసాద్, జి.సి.సి స్టేట్ డైరెక్టర్ చెవుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు. గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో అలరించారు.



మహిళకు భూమి పట్టా అందిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి, జేసీ, ఎమ్మెల్యే

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

కొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం సీతారామచంద్రస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు గర్భాలయంలో సీతా రామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలా నక్షత్రయుక్త మేషలగ్న శుభపుష్కరాంశమునందు యంత్ర ప్రతిష్ఠ, మూల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ శిఖర–కలశ ప్రతిష్ఠలు, ప్రాణ ప్రతిష్ఠ, బింబకళాన్యాసం, కక్షణ్యాల, బలి ప్రదానం– పూర్ణా హుతి కలశ ఉద్వాసన కుంభాభిషేకం, సమయానుసారేణ, సీతారామ శాంతి కళ్యాణం, ఆశీర్వాదం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అంతకు మునుపు ధ్వజస్తంభానికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పండగ వాతావరణం నెలకొంది.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దశ్యం

24న పీఎం కిసాన్ నగదు జమ

వెలుగోడు: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ పథకం ద్వారా ఈనెల 24న రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. వెలుగోడు మండలంలో 5770 మంది రైతులకు 115 లక్షలు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా సబ్సిడీలు పొందాలని సూచించారు.

28న బండలాగుడు పోటీలు

పాములపాడు: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకొని మండలంలోని ఇస్కాల గ్రామంలో రాష్ట్ర స్థాయి వృషభరాజముల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆదివారం నందీశ్వర క్షేత్ర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీన ఇస్కాల గ్రామంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు వరుసగా రూ.40,016, రూ.30,016, రూ.20,016, రూ.15,016, రూ.10,016, చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనదలిచిన వృషభాల యజమానులు రూ.500 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలకు వచ్చే వారికి భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 98665 13812, 83099 25564 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రెండు గ్రామాల్లో చోరీలు

మహానంది: మండలంలోని గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని మూడు దుకాణాల్లో, నందిపల్లె గ్రామంలోని మదార్‌వలి స్వామి దర్గాలో ఒకేరోజు చోరీలు జరిగిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని శ్రీనివాసులు, ఫణీంద్ర, వీరారెడ్డి నిర్వహిస్తున్న కిరాణ దుకాణాల్లో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి వస్తువులు, సామగ్రి ఎత్తుకెళ్లారు. నందిపల్లెలోని మదార్‌వలి స్వామి దర్గాలో తాళాలు పగులగొట్టి హుండీలోని డబ్బులు చోరీ చేసినట్లు నిర్వాహకులు శిలార్‌సా ఫిర్యాదు చేశారు. మహానంది, రోడ్ సేఫ్టీ పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలించారు. దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

వ్యక్తిపై దాడి

మహానంది: మహానంది నుంచి నంద్యాల వెళ్లే మార్గంలో శ్రీనగరం వద్ద ఒకరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు మండలం జూలెపల్లెకు చెందిన డేరంగుల రాంపుల్లయ్యపై కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారన్నారు. బాధితుడి తలకు తీవ్ర గాయాలయ్యాయని, రాంపుల్లయ్య తండ్రి పెద్దపుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు. వివాహేతర సంబంధమే దాడికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మహానంది: గాజులపల్లె నుంచి గుండంపాడు వెళ్లే మార్గంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గుండంపాడు, శ్రీరంగాపురం తదితర గ్రామాలకు చెందిన పలువురు పేకాట ఆడుతుండగా దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.14,200 నగదు స్వాధీనం చేసుకున్నామని, ముగ్గురు పరారైనట్లు వివరించారు.

ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్ పర్యవేక్షణ

శ్రీశైలం: మహాశివరాత్రి ఉత్సవాలకు రెండు రోజులు గడువు మాత్రమే ఉన్నందున శ్రీశైలం మార్గంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక నిఘా కోసం డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. మహాశివరాత్రి పాగాలంకరణ అనంతరం ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం 20 బ్లూ కోట్స్ వాహనాలు, అదనంగా 8 రక్షక్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఘాట్‌రోడ్డులో బ్రేక్ డౌన్ అయిన వాహనాల తొలగింపునకు టోయింగ్ వెహికల్స్ సిద్ధంగా ఉంచుతామన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రాంతాలైన శిఖరేశ్వరం నుంచి ముఖద్వారం అక్కడి నుంచి హఠకేశ్వరం, సాక్షి గణపతి, రామయ్య టర్నింగ్ టోల్‌గేట్, తదితర ప్రదేశాలలో 800 మంది ట్రాఫిక్ పోలీసులను నియమించినట్లు చెప్పారు. సుమారు 1000 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించనున్నట్లు చెప్పారు. భక్తులు సహకరించాలని కోరారు.

నృత్య నీరాజనం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లికార్జున భ్రమరాంబికా దేవి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం కళారాధనలో శ్రీశైల దేవస్థానం, శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నంద్యాల వారి ఆధ్వర్యంలో నృత్య ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి కూచిపూడి, భరతనాట్యం, పేరుని నాట్యం, ఆంధ్ర నాట్యం, ఒడిసి నాట్యం, జానపదం, గిరిజన నాట్య కళాకారులు 350 మంది పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. చక్కటి హావభావాలతో నృత్యం ప్రదర్శించి నాట్య వైభవం చాటారు.

మల్లన్న పాగా సిద్ధం



శ్రీశైల మల్లన్న కోసం తయారు చేసిన పాగా

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ కాలంలో శ్రీశైల మల్లికార్జునుడిని పెళ్లి కొడుకుగా సిద్ధం చేసేలా తలపై పాగాను ఉంచుతారు. ఈ పాగాను ప్రకాశం జిల్లాకు చెందిన ఓ కుటుంబం వంశపారపర్యంగా తయారుచేస్తోంది. ఒక పూట భోజనం, నేల పడక, అనునిత్యం శివనామస్మరణ వంటి నియమ నిష్ఠలతో ఉంటూ పాగాను తయారుచేస్తారు. ప్రకాశం జిల్లా చీరాల మండలం జాండ్రపేట హస్తినాపురం గ్రామానికి చెందిన కందస్వామి, సుబ్బారావు హయాంలో పాగా వస్త్రం తయారీకి ఒక ప్రత్యేక మగ్గాన్ని ఏర్పాటు చేశారు. రోజుకో మూర చొప్పున 300 రోజులు 300 మూరలు నేస్తారు. మహాశివరాత్రి పర్వదినానికి 15 రోజుల ముందు పాగాను శాస్త్రోక్తంగా గ్రామంలో ఊరేగించి శ్రీశైలం బయలుదేరుతారు. ఆదివారం ఆ కుటుంబ వారసులు పృథ్వీ వెంకటేశ్వర్లు పాగాతో శ్రీశైలం చేరుకుని ఆలయంలో సమర్పించారు. మహాశివరాత్రి రోజున స్వామివారికి పాగా అలంకరణ అనంతరం దేవస్థానం తరఫున స్వామివారి దర్శనభాగ్యం కల్పించి రూ.50 వేల ఆర్థిక ప్రోత్సాహం అందిస్తారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ఘనత



విప్రో ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. శనివారం బెంగళూరులోని అజీజ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయంలో జీవ వైవిధ్యంపై తమ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ అత్యుత్తమంగా నిలిచి అచీవర్స్ అవార్డుతో పాటు రూ.50వేల నగదు బహుమతి గెలుచుకున్నట్లు చెప్పారు. విప్రో లిమిటెడ్ సీఈఓ అనురాగ్ బెహర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి, మండల అధికారులు విద్యార్థులను అభినందించారు.

వంశరాజ్ సత్రం ప్రారంభం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో వంశరాజ్ అఖిల భారత నిత్యాన్నదాన సత్రాన్ని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వంశరాజ్ వర్గం వారంతా కలిసి సత్రం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ సీహెచ్ మల్లేష్, వైస్ చైర్మన్ వై.జగదీష్‌కుమార్ ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, సహాయ కార్యదర్శి శ్యామల శంకర్, కోశాధికారి భరత్ భూషణ్, డైరెక్టర్లు, నిర్వాహకులు పాల్గొన్నారు.